క్లుప్తంగా

కార్పొరేషన్ గ్రీవెన్స్‌కు 33 వినతులు



అర్జీలు స్వీకరిస్తున్న డిప్యూటీ కమిషనర్ అమరయ్య

తిరుపతి తుడా : నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (గ్రీవెన్స్)కు 33 వినతులు వచ్చినట్లు డిప్యూటీ కమిషనర్ అమరయ్య తెలిపారు. ఫోన్ ద్వారా 9 మంది , 24 మంది నేరుగా వచ్చి వినతులు సమర్పించారని వెల్లడించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, ఎస్ఈ శ్యామ్‌సుందర్, ఎంఈలు తులసి కుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవెన్యూ అధికారులు సేతు మాధవ్, రవి పాల్గొన్నారు.

మేడే స్ఫూర్తితో పోరాటాలకు సిద్ధం



మాట్లాడుతున్న ఎన్‌డీ రవి

తిరుపతి కల్చరల్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై మేడే స్ఫూర్తితో పోరాటాలకు సిద్ధం కావాలని ఏఐటీయూసీ నగర ప్రధాన కార్యదర్శి ఎన్‌డీ రవి పిలుపునిచ్చారు. సోమవారం ఏఐటీయూసీ కార్యాలయంలో స్ట్రీట్ వెండర్స్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఉద్యమాలతో సాధించుకున్న హక్కులను హరించేందుకు పాలకులు కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. ఈ క్రమంలో హక్కుల పరిరక్షణకు ఉద్యమంతో ప్రభుత్వాలకు తగిన గుణపాఠం చెప్పాలని కోరారు. సమావేశంలో ఏఐటీయూ సీ నగర అధ్యక్షుడు కేవై రాజా, వీధి వర్తక వ్యాపార సంఘం జిల్లా కార్యదర్శి సీహెచ్.శివకుమార్, నేతలు శ్రీనివాసులు, వెంకటేష్, సురేష్, గురవయ్య, విజయ్ పాల్గొన్నారు.

ఆర్టీసీ డీఎంపై దౌర్జన్యం

తిరుపతి అర్బన్ : తిరుపతి డిపోలో విధులు నిర్వర్తిస్తున్న కండక్టర్ లక్ష్మీదేవి భర్త రవి తనపై దౌర్జన్యానికి పాల్పడినట్లు డీఎం బాలాజీ సోమవారం ఈస్ట్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వివరాలు.. తన భార్యకు అనుకూలంగా డ్యూటీలు వేయాలని రవి శనివారం తిరుపతి డిపో వద్ద హల్ చల్ చేశాడు. అంతటితో ఆగకుండా ఆదివారం రాత్రి డీఎం నివాసానికి వెళ్లి ఆయనపై దౌర్జన్యం చేశాడు. డీఎం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బాలకృష్ణ తెలిపారు.

తిమ్మప్ప ఆలయ పరిశీలన

చంద్రగిరి : తొండవాడ సమీపంలోని పురాతన తిమ్మప్ప ఆలయాన్ని టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి సోమవారం సందర్శించారు. ఆయన మాట్లాడుతూ సుమారు 21 ఎకరాల్లోని ఈ ఆలయం ఆక్రమణలకు గురై ప్రస్తుతం 21 సెంట్లకు మాత్రమే పరిమితమైందన్నారు. శిథిలావస్థకు చేరిన ఆలయ పునర్నిర్మాణానికి చర్యలు చేపడతామని వెల్లడించారు. రాబోయే టీటీడీ బోర్డు సమావేశంలో సభ్యుల దృష్టికి తీసుకువస్తామని తెలిపారు. బీజేపీ నేతలు పాదిరి ధనుంజయరెడ్డి, మునిగంగిరెడ్డి, వెంకటముని, సుబ్రమణ్యం యాదవ్ పాల్గొన్నారు.

'మలబార్'లో అక్షయ తృతీయ ఆఫర్లు



ఆభరణాల సేకరణను ఆవిష్కరిస్తున్న కస్టమర్లు

తిరుపతి కల్చరల్ : బాలాజీ కాలనీలోని మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ షోరూమ్‌లో అక్షయ తృతీయను పురస్కరించుకుని బంగారు ఆభరణాలపై ప్రత్యేక ఆఫర్లు ఇస్తున్నట్లు షోరూమ్ హెడ్ రెజిష్ తెలిపారు. సోమవారం ఈ మేరకు 'తన్విక' అనే కొత్త ఆభరణాల సేకరణను మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, కస్టమర్లతో ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ బంగారు ఆభరణాల తరుగు చార్జీలపై 25 శాతం, ప్రీషియస్ స్టోన్స్ అండ్ అన్ కట్ డైమండ్స్ ఆభరణాల తరుగు చార్జీలపై ఫ్లాట్ 25 శాతం తగ్గింపు, వజ్రాల విలువపై 25 శాతం తగ్గింపు అందిస్తున్నట్లు వివరించారు.

వర్సిటీల్లో రాజకీయాలు దారుణం

తిరుపతి సిటీ : యూనివర్సిటీలను రాజకీయాలకు వేదికగా మార్చడం దారుణమని ఏబీవీపీ రాష్ట్ర వర్సిటీల కో-కన్వీనర్ కామిరెడ్డి తరుణ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం అనేక విశ్వవిద్యాలయాల్లో చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలను నిర్వహించడంపై మండిపడ్డారు. విద్యార్థులకు ఆదర్శంగా నిలవాల్సిన వీసీలు, రిజిస్ట్రార్‌లు సైతం వేడుకల్లో పాల్గొని కేక్ కట్ చేయడం సరికాదన్నారు. విద్యాలయాల్లో పొలిటికల్ ఫ్లెక్సీలు, బ్యానర్లు ఏర్పాటు చేయడం సమంజసం కాదని స్పష్టం చేశారు.



అభినందన

జాతీయ స్థాయి స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి రెజ్లింగ్, హాకీ పోటీల్లో బైరాగిపట్టెడలోని ఎంజీఎం నగరపాలక ఉన్నత పాఠశాల విద్యార్థినులు ప్రతిభ కనబరిచారు. 7, 8వ తరగతి విద్యార్థినులు ప్రణీత, జ్యోతిర్మయి రెజ్లింగ్‌లో, 8వ తరగతి విద్యార్థిని మహాలక్ష్మి హాకీలో రాష్ట్రం తరపున పాల్గొని సత్తా చాటారు. సోమవారం ఈ మేరకు విద్యార్థినులను కలెక్టర్ వెంకటేశ్వర్ అభినందించారు. డీఈఓ కేవీఎస్ కుమార్, హెచ్ఎం మునిశారద, పీడీ ప్రసన్నకుమారి పాల్గొన్నారు. – తిరుపతి ఎడ్యుకేషన్

● అవగాహన

విద్యార్థులకు చదువుకునే దశలోనే పరిశ్రమల స్థాపనపై అవగాహన పెంపొందించుకుని పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని వెటర్నరీ వర్సిటీ డీన్ డాక్టర్ వీరబ్రహ్మయ్య తెలిపారు. ఎస్వీ వెటర్నరీ వర్సిటీ ఆధ్వర్యంలో22మంది విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. సోమవారం ఈ మేరకు విద్యార్థులకు సర్టిఫికెట్లు, నగదు అందజేశారు. 1అసోసియేట్ డీన్ డాక్టర్ జగపతి రామయ్య, విభాగాధిపతి విజయభాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు. – తిరుపతి సిటీ



నగరం.. గరం!

నగరవాసులారా .. మీకో 'సన్'గతి చెప్పాలి .. భానుడు భగభగ మండుతున్నాడు. రోజు రోజుకూ ఎండలు ముదురుతున్నాయి. న'గరం'గరంగా మారుతోంది.. టెంపరేచర్ గ్రేడ్ పెరిగి 47 డిగ్రీలను టచ్ చేసే ప్రమాదం పొంచి ఉంది. ఈ క్రమంలో ప్రజలు తమ జీవన శైలిలో మార్పులు చేసుకోవాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. వాతావరణశాఖ హెచ్చరికల మేరకు ఈ వేసవిలో ఎండలు మండే అవకాశముందని హెచ్చరిస్తున్నారు. ఆ మేరకు ఆహార వ్యవహారాల్లో అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేస్తున్నారు.









- రోజురోజుకూ పెరుగుతున్న ఎండలు
- 44 నుంచి 46 డిగ్రీల సెంటీగ్రేడ్ వరకు ఉష్ణోగ్రతలు
- 2017 నాటి పరిస్థితులు పునరావృతమయ్యే అవకాశాలు
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలంటూ ఐఎండీ సూచనలు
- ఆహారం.. పానీయాలపై శ్రద్ధ వహించాలంటున్న వైద్య నిపుణులు

తిరుపతి మంగళం : భారత వాతావరణశాఖ (ఐఎండీ) నివేదికల ప్రకారం తిరుపతి నగరంలో వేసవి గరిష్ట ఉష్ణోగ్రతలు అధికంగా నమోదయ్యే అవకాశముంది. 44 నుంచి 46 డిగ్రీల సెంటీగ్రేడ్ వరకు చేరే ప్రమాదముంది. అంతేకాకుండా రాత్రి ఉష్ణోగ్రతలు కూడా సాధారణ స్థాయికి మించిపోవచ్చని తెలుస్తోంది. ఇది నగర వాసులకు మరింత అసౌకర్యం కలిగించవచ్చు. ఈ వేసవిలో ఎల్‌నినో ప్రభావం కారణంగా వడదెబ్బ తగిలే ప్రమాదం పొంచి ఉంది. ఈ పరిణామాలు నగరవాసుల నిద్ర, ఆరోగ్యంపై ప్రభావం చూపించవచ్చు.

వేసవి తాపం.. తీసుకోవాల్సిన జాగ్రతలు

- వేడి తీవ్రత పెరిగే సమయంలో మన శరీరం నుంచి ఎక్కువగా చెమట రూపంలో నీరు పోయి డీహైడ్రేషన్ సమస్యలు తలెత్తవచ్చు. అందువల్ల నీటిని రోజుకు కనీసం 3–4లీటర్లు వరకు తాగడం, కొబ్బరినీరు, నిమ్మకాయ రసం, బటర్‌మిల్క్ లాంటి సహజ పానీయాలను ఎక్కువగా తీసుకోవడం అవసరం.
- ఇళ్ల నుంచి బయటకు వెళ్లే సమయాన్ని ఎంచుకోవడం చాలా ముఖ్యం. మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 4గంటల వరకు అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లకూడదు. వెళ్లాల్సి వచ్చినప్పుడు శరీరాన్ని కప్పి ఉంచేవిధంగా లైట్ కలర్ నూలు వస్త్రాలు, కూలింగ్ గాగుల్స్, స్కార్ఫ్ లాంటి రక్షణ దుస్తులు ధరించాలి. సన్‌స్క్రీన్ లోషన్‌ను తప్పనిసరిగా వాడాలి.
- తేలికపాటి ఆహారం, తాజా కూరగాయలు, పండ్లు, తేమ కలిగిన పదార్థాలకు ఎక్కువగా తీసుకోవాలి. ఇంటిని చల్లగా ఉంచడానికి మొక్కలు, గాలి చక్కగా వచ్చేలా కిటికీలు ఏర్పాటు చేసుకోవడం మంచిది.
- వేసవిలో కొద్దిపాటి వర్షాలు కురుస్తాయనే అంచనాలున్నప్పటికీ, అవి ఎండ తీవ్రతను తగ్గించేంతగా ప్రభావం చూపించవు. అంతేకాదు వర్షాల తర్వాత తేమ పెరగడం వల్ల ఉక్కపోత విపరీతంగా పెరిగేలా వాతావరణం మారే ప్రమాదముంది. ఈ సమయంలో చిన్నారులు, వృద్ధులు మరింత జాగ్రత్తగా ఉండడం అవసరం.



ఎండ తాకిడికి గొడుగులను ఆశ్రయించిన పిల్లలు



వడదెబ్బ తగలకుండా..



చల్ల చల్లగా..



నీళ్ల బాటిల్ ఉండాల్సిందే..



తల్లీ బిడ్డకు ఛత్రమే రక్ష..

మోడల్ టెస్ట్ పోస్టర్ ఆవిష్కరణ

తిరుపతి అర్బన్ : ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించనున్న మోడల్ టెస్ట్ కు సంబంధించిన పోస్టర్‌ను కలెక్టర్ వెంకటేశ్వర చేతులమీదుగా సోమవారం కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. ఎస్ఎఫ్ఐ నేతలు మాట్లాడుతూ ఈనెల 22, 23 తేదీల్లో నీట్, 26, 27, 28 తేదీల్లో ఎంసెట్ మోడల్ టెస్ట్‌లను కరకంబాడీ రోడ్డులోని అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాలలో ఆన్‌లైన్ ద్వారా నిర్వహించనున్నట్లు తెలిపారు. వివరాలకు 6281392799, 8179492515 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు అక్బర్, కార్యదర్శి భగత్ రవి, ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్, రెడ్డికుమార్, శివ పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

ఆస్తి కాజేసిందని ఆవేదన


తిరుపతి సిటీ : సుందరయ్య నగర్‌కు చెందిన హేమలత అనే మహిళ తమ ఆస్తి కాజేసిందని ఎస్వీ నగర్‌కు చెందిన విశ్రాంత ఎస్ఐ వెంకటరమణ ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో భార్య రాజేశ్వరి, కుమారుడు గంగాధర్, వార్డు మెంబర్ నాగ రాజుతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. తమ ఇంటి వద్ద చిల్లర దుకాణం నిర్వహిస్తున్న తమ కుమారుడు గంగాధర్‌తో హేమలత సాన్నిహిత్యం పెంచుకుందన్నారు. మూర్ఛ వ్యాధితో బాధపడే తమ కుమారుడికి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని మాయమాటలు చెప్పి వలలో వేసుకుందని ఆరోపించారు. ఈ క్రమంలో తమ కుమారుడి నుంచి రూ.8.5 లక్షల నగదు తీసుకుందన్నారు. అలాగే తమకు తెలియకుండా గంగాధర్ పేరుతో ఉన్న రేకుల ఇల్లు, ఖాళీ స్థలాన్ని రూ.25లక్షలతో కొన్నట్లు నకిలీ పత్రాలు సృష్టించి కాజేసిందని వాపోయారు. ఆ పత్రాలతో తమ ఆస్తిని శారద అనే మహిళలకు విక్రయించిందని తెలిపారు. దీనిపై అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి విచారణ చేయించి తమకు న్యాయం చేయాలని కోరారు.



మాట్లాడుతున్న వెంకటరమణ దంపతులు

సోమనాథ్‌దాస్‌కు అవార్డు

తిరుపతి సిటీ : న్యూ ఢిల్లీలోని కేంద్ర సాహిత్య అకాడమీ సంస్కృత భాషకు సంబంధించిన సాహిత్య అకాడమీ అనువాద అవార్డును సోమవారం ప్రకటించింది. జాతీయ సంస్కృత వర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సోమనాథ్ దాస్‌ను ప్రతిష్టాత్మక అవార్డు వరించింది.



కలెక్టరేట్‌లో క్యాంటీన్ ప్రారంభం





కలెక్టరేట్‌లో ప్రారంభించిన క్యాంటీన్

సాక్షి ఎఫెక్ట్..

తిరుపతి అర్బన్ : కలెక్టరేట్‌లోని క్యాంటీన్ ఎట్టకేలకు 9 నెలలు తర్వాత అందుబాటులోకి వచ్చింది. 'కలెక్టరేట్‌లో ఆకలి కేకలు' శీర్షికతో సాక్షి పత్రికలో శనివారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. సోమవారం ఈ మేరకు క్యాంటీన్ ప్రారంభించడం విశేషం.

గతంలోని అద్దెకే..

జిల్లాల పునర్విభజన తర్వాత తిరుపతిలో నూతనంగా ఏర్పాటైన కలెక్టరేట్‌లో క్యాంటీన్ ఏర్పాటు చేశారు. వివిధ పనుల నిమిత్తం వచ్చేవారితోపాటు కలెక్టరేట్ ఉద్యోగులకు సైతం క్యాంటీన్ ఎంతో సౌకర్యంగా ఉండేది. ఆహారం, తినుబండారాలు, టీ, కాఫీలు, కూల్‌డ్రింక్‌లు అందుబాటులో ఉండేవి. అయితే కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రాజకీయ నేతల జోక్యంతో క్యాంటీన్ మూతపడింది. ఈ క్రమంలో కలెక్టరేట్‌కు వచ్చిన ప్రజలు, ఉద్యోగులు తీవ్రంగా ఇబ్బందిపడ్డారు. మళ్లీ ఇన్నాళ్లకు క్యాంటీన్ పునఃప్రారంభం కావడంతో అందరూ హర్షం వ్యక్తం చేస్తున్నారు. అలాగే అద్దె పెంచకుండా, అడ్వాన్స్ లేకుండా స్థానికుడికి క్యాంటీన్ నిర్వహణ అప్పగించడంపై సంతోషం వెలిబుచ్చుతున్నారు. దీంతో సరసమైన ధరలకే ఆహారపానీయాలు అందుబాటులోకి వస్తాయని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

రేపటి నుంచి భాష్యకార్ల ఉత్సవం

తిరుపతి కల్చరల్ : శ్రీగోవిందరాజస్వామి వారి ఆలయంలో ఈనెల 23 నుంచి మే 2వ తేదీ వరకు భాష్యకార్ల (శ్రీరామానుజాచార్యులు) ఉత్సవం నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా ప్రతి రోజు ఉదయం 7.30 గంటలకు భాష్యకార్ల వారిని బంగారు తిరుచ్చిపై చిన్నమాడ వీధి ఉత్సవం, సాయంత్రం 6.30 నుంచి రాత్రి 8 గంటల వరకు పెద్ద మాడ వీధి ఉత్సవం జరిపించనున్నారు. ఉదయం ఊరేగింపు అనంతరం ఆలయంలో తిరుమంజనం, శాత్తుమొర, ఆస్థానం చేపట్టనున్నారు. మే 1న భోగితేరు, 2వ తేదీన శాత్తుమొర నిర్వహించనున్నారు. 3వ తేదీన గంధపొడి ఉత్సవం జరిపించనున్నారు.

మురళీకృష్ణకు డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న మురళీకృష్ణ

తిరుపతి అర్బన్ : జ్యోతిష్య ఆచార్య మురళీకృష్ణకు వేదిక్ సైన్స్ స్పెషలైజేషన్ ఇన్ ప్లానెట్స్ అండ్ బావాస్ రీసెర్చ్‌కు సంబంధించి డాక్టరేట్ లభించింది.సోమవారం నగరంలోని ఓ కల్యాణ మండపంలో నిర్వహించిన సదస్సులో ఆయనకు ఎస్ఎస్ లైవ్ ఆస్ట్రాలజీ వ్యవస్థాపకుడు నరసింహ స్వామి చేతుల మీదుగా డాక్టరేట్ ప్రదానం చేశారు.

ఆదినారాయణకు అదనపు బాధ్యతలు



తిరుపతి లీగల్ : తిరుపతి 3, 4, 5 అదనపు జిల్లా జడ్జి కోర్టులలో ప్రభుత్వ న్యాయవాదిగా పనిచేస్తున్న శాఖమూరి ఆదినారాయణను ఇన్‌చార్జి ప్రత్యేక గవర్నమెంట్ ప్లీడర్ గా నియమిస్తూ డీఆర్ఓ నరసింహులు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం

చంద్రగిరి : ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా చర్యలు చేపడుతున్నట్లు తహసీల్దార్ శివరామసుబ్బయ్య తెలిపారు. సోమవారం గ్రీవెన్స్ సందర్భంగా ప్రజల నుంచి వివిధ సమస్యలపై అర్జీలు స్వీకరించారు. వాటిని వెంటనే పరిశీలించి సత్వరం పరిష్కరించాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈక్రమంలోనే ఎంతటి వారైనా ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు.

నర్సింగ్ విద్యార్థినుల ప్రతిభ

తిరుపతి తుడా : రుయా ఆస్పత్రి ఆధ్వర్యంలో నడుస్తున్న ఎంపీహెచ్‌డబ్ల్యూ నర్సింగ్ కళాశాల విద్యార్థినులు పరీక్ష ఫలితాలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. 22 మంది ఫస్టియర్ విద్యార్థినులకు గాను 20 మంది డిస్టింక్షన్‌లో ఉత్తీర్ణులయ్యారు. మరో ఇద్దరు సెకండ్ క్లాస్‌లో పాస్ అయ్యారు. అలాగే రెండవ ఏడాది ఫలితాలలో 17 మందికి గాను 17మంది డిస్టింక్షన్‌లో ఉత్తీర్ణులయ్యారు. ఈ సందర్భంగా రుయా సూపరింటెండెంట్ డాక్టర్ రవిప్రభు, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ రమాదేవి విద్యార్థినులకు సర్టిఫికెట్లు అందించారు.



సర్టిఫికెట్లు అందిస్తున్న రవిప్రభు

అధినేత ఆదేశాలే శిరోధార్యం

తిరుపతి రూరల్ (రామచంద్రాపురం) : వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలే శిరోధార్యంగా పనిచేస్తామని, పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తామని రామచంద్రాపురం మండల కమిటీ నేతలు స్పష్టం చేశారు. సోమవారం ఈ మేరకు వైఎస్సార్‌సీపీ చంద్రగిరి నియోజకవర్గ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ మండల కమిటీలో పదవులు కల్పించే దిశగా చొరవ చూపినందుకు కృతజ్ఞతలు తెలిపారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు యద్దల చంద్రశేఖర్‌రెడ్డి, నేత భానుప్రకాష్‌రెడ్డి ఆధ్వర్యంలో మోహిత్‌రెడ్డిని ఘనంగా సత్కరించారు. మోహిత్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు. ప్రజల వెంటే ఉంటూ కూటమి నేతల అరాచకాలను ఎప్పటికప్పుడు ఎండగట్టాలని ఆదేశించారు.



మోహిత్‌రెడ్డిని సత్కరిస్తున్న నేతలు

విభిన్న ప్రతిభావంతులకు ఉపకరణాలు

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతి ఎంజీఎం హైస్కూల్ ఆవరణలోని భవిత కేంద్రంలో విభిన్న ప్రతిభావంతులకు సోమవారం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, కలెక్టర్ వెంకటేశ్వర్ చేతులమీదుగా ఉపకరణాలను అందజేశారు. అలిమ్కో, జిల్లా సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో 421మంది ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ట్రైసైకిళ్లు, వీల్‌చైర్లు, రోలేటర్స్, హియరింగ్ కిట్స్, బ్రెయిలీ కిట్స్ తదితర ఉపకరణాలను అందించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ప్రత్యేకావసరాల విద్యార్థులు సుమారు 3,600మంది ఉన్నారని, వీరి భవిష్యత్తుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నట్లు తెలిపారు. జిల్లాలోని 34 భవిత పాఠశాలల్లో విద్యనభ్యసించే విభిన్న ప్రతిభావంతులకు ఉపకరణాలను అందించినట్లు వివరించారు. డీఈఓ కేవీఎస్ కుమార్, డీవైఈఓ బాలాజీ, ఇంక్లూజివ్ కో–ఆర్డినేటర్ చంద్రశేఖర్ రెడ్డి, హెచ్ఎం మునిశారద పాల్గొన్నారు.



ఉపకరణాల పంపిణీలో కలెక్టర్, ఎమ్మెల్యే

పాఠశాల కొనసాగింపునకు వినతి

తిరుపతి రూరల్ : మండలంలోని పేరూరు ఎంపీపీ పాఠశాలను కొనసాగించాలని ఎంపీపీ మూలం చంద్రమోహన్‌రెడ్డి కోరారు. సోమవారం ఈ మేరకు డీఈఓకు లేఖ రాశారు. పేరూరు ఎంపీపీ స్కూలును హరిపురం కాలనీ పాఠశాలలో విలీనం చేయడంపై స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు వెల్లడించారు. 4, 5 తరగతుల విద్యార్థులను మ్యాప్ చేసి ఒకే పాఠశాలగా ఏర్పాటు చేయడానికి గ్రామస్తులు అంగీకరించడం లేదని పేర్కొన్నారు. పేరూరు పాఠశాలలో 27 మంది విద్యార్థులు ఉన్నారని, హరిపురం కాలనీ పాఠశాలలో 17మంది మాత్రమే ఉన్నారని వివరించారు. ఈ క్రమంలోనే సర్పంచ్ దామినేటి కేశవులు ఆధ్వర్యంలో పంచాయతీ చేసిన తీర్మానం ప్రతిని సైతం లేఖకు జతపరిచినట్లు వెల్లడించారు.

నోటీస్ బోర్డు

- పద్మావతి మహిళా వర్సిటీలో ×సైన్స్, టెక్నాలజీ అండ్ అప్లికేషన్స్ ఆఫ్ రేర్ ఎర్త్ । అంశంపై ఉదయం 10 గంటలకు అంతర్జాతీయ సదస్సు.
- తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో ఉదయం 7 నుంచి 8 గంటల వరకు అమ్మవారికి అభిషేకం,

గజవాహనంపై అలిమేలుమంగమ్మ

తిరుపతి రూరల్ : తిరుచానూరు పద్మావతీదేవి సోమవారం సాయంత్రం గజవాహనంపై ఊరేగుతూ భక్తులకు కటాక్షించారు. భక్తులు అమ్మవారికి కర్పూర హారతులు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఏఈఓ దేవరాజులు, ఇన్‌చార్జి సూపరింటెండెంట్ ప్రసాద్, ఏవీఎస్వో సతీష్ కుమార్, వీఐ రాము, ఇన్‌స్పెక్టర్లు సుబ్బారాయుడు, సుభాస్కర్ నాయుడు, చలపతి పాల్గొన్నారు.

కో-ఆపరేటివ్ ఉద్యోగులకు ఊరట

తిరుపతి సిటీ : ఎస్వీయూ కోఆపరేటీవ్ స్టోర్స్ నుంచి తొలగించిన తాత్కాలిక ఉద్యోగులకు ఊరట లభించింది. అధికారులు ఇచ్చిన టెర్మినేషన్ ఆర్డర్స్‌ను హైకోర్టు సస్పెండ్ చేసింది. తదుపరి ఉత్తర్వులు ఇచ్చేవరకు వారిని కొనసాగించాలని పేర్కొంది. ఈ మేరకు రాష్ట్ర, జిల్లా సహకార శాఖ అధికారులతో పాటు వర్సిటీ కన్స్యూమర్స్ కో–ఆపరేటివ్ స్టోర్స్ ఇన్‌చార్జి, తిరుపతి డివిజనల్ కో–ఆపరేటివ్ అధికారికి సోమవారం ఆదేశాలు జారీ చేసింది. దీంతో తొలగించిన సుమారు 9మంది ఉద్యోగులు విధులలో చేరనున్నారు.

ఘనంగా ప్రజా సంబంధాల దినోత్సవం

తిరుపతి సిటీ : పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా తిరుపతి ఆధ్వర్యంలో సోమవారం ఎస్వీయూ కామర్స్, మేనేజ్‌మెంట్ అండ్ కంప్యూటర్స్ కళాశాలలో జాతీయ ప్రజాసంబంధాల దినోత్సవం నిర్వహించారు. ప్రిన్సిపల్ పీవీ నరసయ్య మాట్లాడుతూ కృత్రిమ మేధను బాధ్యతాయుతంగా వినియోగించడంలో ప్రజా సంబంధాలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ పి.వెంకట కృష్ణ, ఐఐటీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ యేటూరు కాళిదాస్, హెచ్ఓడీ ప్రొఫెసర్ జి.అంజిన్‌బాబు, పీఆర్ఎస్ఐ తిరుపతి చాప్టర్ చైర్మన్ జీఎస్ ప్రసాద్ పాల్గొన్నారు.

అంతరాయం..అంధకారం

తిరుపతి తుడా: తిరుపతి నగరం ఆదివారం రాత్రి అంధకారంలోకి వెళ్లిపోయింది. అలిపిరి సబ్ స్టేషన్ ఓవర్ హీట్ కారణంగా కాలిపోయింది. దీంతో రాత్రి 7.50 గంటల సమయంలో అలిపిరి సబ్ స్టేషన్ పరిధిలోని కాలనీలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. అలిపిరి మొదలు అన్నారావు కూడలి, హరే రామ హరే కృష్ణ రోడ్, ఎన్‌జీఓ కాలనీ, రైల్వే కాలనీ, శివ జ్యోతి నగర్, ఎర్రమిట్ట , జీవకోన, సత్యనారాయణపురం, ఉపాధ్యాయ నగర్ వరకు నగర ఉత్తరభాగానికి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. గంటన్నరకు పైగా కరెంట్ లేకపోవడంతో ప్రజలు అల్లాడిపోయారు.